కారు, లారీ ఢీ
ఇద్దరు మృతి



జెసిబి సాయంతో మృహాలను వెలికి తీస్తున్న పోలీసులు, స్థానికులు

మరో ఐదుగురికి గాయాలు
తిరుమలకు వెళ్తుండగా ఘటన
బాధితులు తెలంగాణ వాసులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... తెలంగాణ ప్రాంతం మహబూబ్‌నగర్ జిల్లా గూత్‌పూర్ మండల అమీషార్ గ్రామానికి చెందిన ఏడుగురు తిరుమలకు పయనమయ్యారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు కారులో శనివారం బయలుదేరారు. ఆదివారం ఉదయం ఒంటిమిట్ట మండల పరిధిలోని మంగంపేట ఇరుకురాళ్ల బోట్టు మలుపు వద్ద చెన్నై నుంచి ఎదురుగా వస్తున్న లారీ వేగంగా కారును ఢీకొంది. దీంతో కారు రెండు ఫల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వంశీకృష్ణ (24), సురేష్ (24) ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు హనుమంతు, కృష్ణవేణి, బిందేశ్వరి, రాము, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. జెసిబి సాయంతో కారులో ఇరుకున్న రెండు మృతదేహాలను వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన యువకులు



ర్యాలీలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉద్యోగులు

ఎన్‌జిఒల సమస్యల పరిష్కారానికి కృషి
- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎన్‌జిఒల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి చేస్తామని ఏపి ఎన్‌జిఒ రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసులు, కె.వి. శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ముందుగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఇరిగేషన్ కాంపౌండ్ నుంచి ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్ మీదుగా జడ్‌పి కార్యాలయానికి చేరుకుంది. అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర నిధులు లేని కారణంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటవ తేదీ జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కరోనా తర్వాత రాష్ట్రం ఆర్థికంగా ఎంతో వెనుకబడిందని చెప్పారు. కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్, కోశాధికారి నిత్యపూజయ, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు,, తిమ్మారెడ్డి, బాల పుల్లయ్య, దస్తగిరి, జాయింట్ సెక్రెటరీ పోలిరెడ్డి, వెంగళరావు, నరసింహారెడ్డి, రాజశేఖర్, జయలక్ష్మి, నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్నయ్య, శైలేశ్వర్‌రెడ్డి, వెంగళరావు, ప్రభుకర్, మున్వర్. ఉద్యోగ,కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు లక్ష్మీనారాయణ

మాజీ సైనికుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- కడప అర్బన్

మాజీ సైనికుల పట్ల రక్షణ శాఖ నిర్లక్ష్యం వహించడం తగదని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సిఎస్ఐ హైస్కూల్‌లో జిల్లా మాజీ సైనికుల సమావేశం కెప్టెన్ ఎస్.ఎం. బాషా, అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ బి.వి. గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జానకిరామ్, సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సమస్యల పైన చర్చించారు. ముఖ్యంగా వారి సంక్షేమార్థం పనిచేస్తున్న కార్యాలయాలలో సైనికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న సబ్సిడీలు, సౌలభ్యాలు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని పారదర్శకంగా ఉంచటం కోసం సైనిక కార్యాలయంలో అడ్వైజరీ బోర్డు, ఇసిహెచ్ఎస్‌లో కన్సల్టెంట్ కమిటీ, మిల్ట్రీ క్యాంటీన్ లో కన్స్యూమర్ కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై పున ప్రారంభించాలని సంబంధిత అధికారులకు పలు విధాల వివరించినా వారు స్వార్థం కోసం నేటికీ స్పందించలేదని వాపోయారు. కేంద్రం ఇటీవల మాజీ సైనికుల కోసం నూతన పెన్షన్ విధానం ఏకపక్షంగా బలవంతంగా ఏర్పాటు చేయడంతో ఆన్‌లైన్ పరిజ్ఞానం లేని వృద్ధులు, వితంతువులు, మారుమూల ప్రాంతాలలో నివసించే వారు అవగాహన లేక సతమతమవుతున్నారని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

లోకేష్‌కు సంఘీభావంగా 'బత్యాల' పాదయాత్ర

ప్రజాశక్తి- ఒంటిమిట్ట (సిద్ధవటం)

మండలంలోని భాకరాపేట నుంచి ఒంటిమిట్ట వరకు రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు ఆదివారం పాదయాత్ర కొనసాగించారు భాకరాపేటలో గ్రామదేవత గంగమ్మ అమ్మవారికి టెంకాయ కొట్టి అమ్మవారి ఆశీస్సులు తీసుకొని పాదయాత్ర మొదలుపెట్టారు. దారి పొడవునా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలుకుతూ పాదయాత్రలో కొనసాగుతూ వెళ్లారు. కార్యక్రమంలో సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దశరథ నాయుడు, మాజీ మండల ప్రెసిడెంట్ సోమ శ్రీనివాసులు రాయుడు,రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు, పుత్తా రామచంద్రయ్య, కార్యదర్శి నాగముని రెడ్డి, రాష్ట్ర బిసి కార్య నిర్వహణ కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, బూత్ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు, మండల కార్యకర్తలు మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'క్లాట్' ఎంట్రన్స్‌లో జోషిత ప్రతిభ

ప్రజాశక్తి-కడప సిటీ



రాగిరి జోషిత

నేషనల్ లెవల్ క్లాట్ ఎంట్రన్స్ పరీక్షలో కడప నగరానికి చెందిన రాగిరి జోషిత ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో 28వ ర్యాంక్ సాధించారు. ఈమె హైదరాబాద్ శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం ఆమె తండ్రి, రిమ్స్ మానసిక విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకట్రాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్ చదువుతూనే నల్సర్ యూనివర్శిటీలో బిఎ ఎల్ఎల్‌బి ఐదేళ్ల కోర్సుకు సంబంధించి క్లాట్ ఎంట్రన్స్‌లో ఉత్తమ ర్యాంకు తెచ్చుకుని సీటు సాధించారని చెప్పారు. నల్సర్ యూనివర్శిటీ చరిత్రలో సుమారు 20 ఏళ్ల తరువాత కడప నగరానికి చెందిన తన కుమార్తె ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లి డాక్టర్ పి.రమణ కుమారి, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - కడప

నగరపాలక ప్రాథమిక ఉన్నత పాఠ శాల నాగరాజు పేట కడపలో పూర్వపు విద్యార్థుల కలయిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 35 సంవత్సరాల తరువాత 1986- 87 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఉపాధ్యారాయురాలు ఆలిషమ్మ, ప్రభావతమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 1996-97 బ్యాచ్ విద్యార్థులు సతీష్, శివ, జలీల్ ఖాన్, ఆది జిలాని, వెంకట్, అబ్దుల్, నిజాం, ప్రసన్న, పుణ్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో
పాలకులు విఫలం
యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ విమర్శించారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ అధ్యక్షతన జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని బి.లక్ష్మీరాజా, యుటిఎఫ్ పతాకాన్ని మాదన విజయ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బి.లక్ష్మి రాజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని సేవా రంగంగా కాకుండా వ్యాపారీకరణ దృష్టితో చూస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తూ కార్పొరేటీకరిస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో పాలకులు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేద,బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను అందకుండా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఇపి అమలు చేసే సాకుతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మూసి వేస్తూ, ప్రభుత్వ విద్యకు పాడె కడుతున్నారని వాపోయారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటానని, అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు అమలు చేస్తామని, సకాలంలో డిఎలను చెల్లిస్తామని ఎన్నికల వాగ్దానంగా ప్రకటించారన్నారు. ఇప్పుడు ఉన్న వేతనాలలో కోత విధించి చరిత్రకెక్కాడని ఎద్దేవా చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్ములను తమ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యా యులంటేనే భయపడుతోందని వాపోయారు. ఆ భయానికి కారణమేంటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను దూరం చేసేందుకే ఎన్నికల విధుల నుంచి తప్పించామని ప్రకటించుకుంటున్న ప్రభుత్వం నిత్యం పాఠశాలల్లో చేయిస్తున్న బోధనేతర కార్యక్రమాలపై ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుండి తప్పించగలరేమో కానీ ఉద్యోగ ,ఉపాధ్యాయులలో ఉన్న అసంతృప్తిని తొలగించలేరన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులను, ప్రభుత్వ తొత్తులను ఓడించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటూ ప్రజా, ఉద్యోగుల గొంతుకలను వినిపించే కత్తి నర్సింహారెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా, పోతుల నాగరాజును పట్టభద్రులు ఎమ్మెల్సీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పాలకుల తీరు మారకపోతే తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ ప్రసంగించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.రూతు ఆరోగ్య మేరీ, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎన్.నాగార్జున రెడ్డి, వై.మస్తానయ్య, డి.వి.రవీంద్రుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సుజాత రాణి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజ

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ప్రయత్నాలు ఆపాలి
14న ఆర్ఎం కార్యాలయం వద్ద ఆందోళన
సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్లను దశలవారీగా ప్రయివేట్ వ్యక్తులు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పాతబస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న నగరంలోని ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలో మదనపల్లి బస్టాండ్‌ను ఎంపిక చేసి ప్రతిపాదన స్థిం చేసిందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్లను 33 సంవత్సరాలు పాటు లీజ్‌కు ఇచ్చి, ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే చర్యలు మానుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ల వినియోగానికి లీజ్‌కు ఇచ్చేందుకు ఈనెల 14న ఆర్‌టిసి కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని చేసిన ఆలోచనలను విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు ఎక్కువ కాలం లీజుకు కట్టబెట్టడం ద్వారా రానున్న కాలంలో ప్రయివేట్ ఆధీనంలోనే కొనసాగే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆదాయం సమకూర్చడానికి ఇతర మార్గాలు ఉన్నాయని చెప్పారు. విచ్చలవిడిగా ఇతరులకు కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గమైన చర్యని వారన్నారు. తక్షణమే ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలన్నారు. నిరసనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యుడు ఎం. ఆర్. నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

కడప హజ్ హౌస్ నుంచే యాత్ర కొనసాగేలా పోరాటం
-ముస్లిమ్ సంఘాల తీర్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నిరుపయోగంగా ఉన్న హజ్ హౌస్ ఉపయోగంలోకి రావాలంటే హజ్‌యాత్ర కడప హజ్ హౌస్ నుంచే కొనసాగేందుకు పోరాడుదామని ముస్లిం సంఘాల నాయకులు తీర్మానం చేశారు. ఆదివారం ఎ.కె. ఫంక్షన్ హాలులో సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో హజ్ హౌస్ పరిరక్షణ కమిటీ ఏర్పాట కై పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2019లో రూ.26 కోట్లు వెచ్చించి అప్పటి ప్రభుత్వం నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు కేంద్రమైన కడప పట్టణంలో హజ్ హౌస్ ఏర్పాటు చేసిందని చెప్పారు. కడప ఎయిర్ పోర్ట్‌కు అంతర్జాతీయ స్థాయి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం కేవలం రాజకీయ కక్షతో హజ్ హౌస్‌ను నిర్లక్ష్యంతో ఉపయోగంలోకి రాకుండా చేసిందన్నారు. హజ్ యాత్ర ముస్లిం మైనార్టీ ల పై విధిగా ఉంటుందని పేర్కొన్నారు.దీనికి సంబంధించిన హజ్ హౌస్ ఆధ్యాత్మిక రంగా నికి చెందుతుందని తెలిపారు. దీన్ని రాజకీయంతో ముడి పెట్టడం సబబు కాదన్నారు. జిల్లాకు చుట్టు ఉన్న 11 జిల్లాలలో నుంచి అధిక శాతం ప్రజలు అరబ్ దేశాలలో ఉద్యోగరీత్యా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వారిలో 90 శాతం ముస్లిం మైనార్టీలు ఉన్నారని పేర్కొన్నారు. ఏ విధంగా చూసిన హజ్ హౌస్ ఉపయోగంలోకి వస్తే ఎయిర్ పోర్ట్‌తో పాటు నగరం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అరబ్ దేశాలకు వెళ్లాలన్నా, రావాలన్నా నేరుగా కడప నుంచే ప్రయాణం సాగించవచ్చన్నారు. ఏ విధంగా చూసినా ప్రభుత్వానికి లాభదాయకం, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ముస్లిం మైనార్టీలకు సంబంధించిన శాఖలు సైతం హజ్ హౌస్ నుంచే నేరుగా సేవలు అందించవచ్చన్నారు. సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ హజ్ హౌస్ పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మరొకసారి సమావేశమై భవిష్యకార్యచరణం రూపొందించుకుని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అమీర్ బాబు, జిలాన్ బాషా, జమీల్, జాకీర్ హుస్సేన్, సయ్యద్ అహ్మద్(బాబు భాయ్), దస్తగిరి, రఫిక్ ఖాన్, షేక్ అరీఫ్, షబ్బీర్, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సలావుద్దీన్

విద్యారంగ పరిరక్షణకే బరిలోకి
బహుమతుల పంపిణీతో సంబంధం లేదు
ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా పరిరక్షణే ధ్యేయంగా తాను పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగానని, గిఫ్ట్‌బాక్సుల పంపణీతో తనకు సంబంధం లేదని ఎం.వి. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని తన ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రయివేట్ ఉపాధ్యాయులకూ ఓటు ఉన్నప్పుడు ఈ సెక్టారు నుంచి మనం ఎందుకు శాసనమండలికి పోటీ చేయకూడదని అపుస్మా రాష్ట్ర కార్యవర్గం సమాచాలోచనలు చేసి తనను అభ్యర్థిగా నిలవాలని కోరిందని చెప్పారు. తాను గతంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకునిగా చేసిన సేవలను గుర్తించి తన అభ్యర్థిత్వాన్ని 36 ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు కూడా బలపరిచాయని చెప్పారు. అధికార వైసిపి కూడా మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు కొంత మంది దురుద్దేశ పూర్వంగా తనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలా ఇరకాటంలో పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇలాంటి అసత్య ప్రచారాలు తన విజయాన్ని అడ్డుకోలేవని పేర్కొన్నారు. తాను కరోనా సమయంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య హక్కుల కోసం, ఉపాధ్యాయుల భవిత కోసం అనేక సమస్యలను పరిష్కరించానని చెప్పారు. తాను చేసిన సేవలను గుర్తించి ఉపాధ్యాయ సంఘాలు తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపడమేగాక విజయానికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. తాను శాసన మండలిలో అడుగుపెట్టెగానే రాబోయే ఫిట్‌మెంట్‌లో అత్యధిక వాటాను ప్రభుత్వ ఉపాధ్యాయులకు వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఉపాధ్యాయులకు రావాల్సిన న్యాయపరమైన డిమాండ్లపై స్వయంగా ముఖ్యంత్రితో మాట్లాడి వాటి పరిష్కార దిశగా ముందుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ప్రయివేట్ ఉపాధ్యాయులకు ఇంటి స్థలంతోపాటు అర్హులైన వారికి బ్యాంకురుణాలు, హెల్త్‌కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, పిఆర్‌టియు ఎన్నికల కన్వీనర్ గుజ్జుల తిరుపాల్, ప్రధాన కార్యదర్శులు మోపూరు శివారెడ్డి, ఉపాధ్యాయ సంఘాలు, అపుస్మా సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం. వి. రామచంద్రారెడ్డి

ప్రాణం తీసిన ఈత సరదా
-పెన్నానదిలో దిగి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇద్దరు యువకులు సరాదా కోసం పెన్నానదిలో ఈతకెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన సోములవారిపల్లె పంచాయతీ పధిలోని థర్మల్ రోడ్డు సమీపంలో ఉన్న పెన్నానదిలో చోటు చేసుకుంది. వివరాలు.. ప్రొద్దుటూరు పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన పోయిలమేన సురేంద్ర కుమారుడు పోయిలమేన సుధాకర్ (19), ఎద్దల నాగయ్య కుమారుడు విజయ్‌కుమార్ (18) ఆదివారం ఉదయం సెలవు రోజు కావడంతో ఈత కోసం సోములవారిపల్లె పంచాయతీలోని థర్మల్‌రోడ్డు సమీపంలో ఉన్న పెన్నానదిలో ఈతకెళ్లారు. అక్కడ ఇద్దరూ ఈత కొడుతుండగా ఒక్కసారిగా నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. రోడ్డుకు అటుగా వెళ్తున్న వారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు గజ ఈతగాళ్ల సాయంతో వారి జాడ కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. వారిలో విజయ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మరో యువకుడు సుధాకర్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు యువకుల మృతదేహాలను ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుల మృతితో హనుమాన్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటి ప్రవాహం తక్కువగా ఉన్నా..

నీటి ప్రవాహం తక్కువగా ఉన్నా ఇద్దరు యువకులు కేవలం ఇసుక ఊబిలో కూరుకుపోయి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా ఏర్పడిన గుంతల వల్లే ఇలా పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టే వస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-చెన్నూరు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీ వెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కెఎన్ఆర్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 250 మంది వైద సేవలందించారు. జడ్‌ఎటిసి ముదిరెడ్డి దిలీప్‌రె డ్డి, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, మండల వైసిపి కన్వీనర్ జి.ఎన్. రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బిపి, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా ,డెంగ్యూ ,టైఫాయిడ్, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, పక్షవాతం కామెర్లు మొదలగు వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు విజయలక్ష్మి మహిళలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఎరసని మోహన్‌రెడ్డి, మండల కో - ఆప్షన్ సభ్యులు వారిస్, వైసిపి నాయకులు సూరతాని శ్రీనివాసులు, ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

గర్భిణికి రక్త దానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని నల్లగుండుపల్లి గ్రామానికి చెందిన తులసి అనే గర్భిణికి ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా ఆమె బంధువులు రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థపకులు నాయబ్‌రసూల్‌ను స్పందించారు. వారు వనిపెంట రామయ్యచే ఆదివారం రక్తదానం చేయించారు. .ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ ప్రసాద్, రసూల్ మాట్లాడుతూ అడిగిన వెంటనే రక్త దానం చేసిన రామయ్యను అభినందించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్ , కేశవ హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగి శ్రీనివాసులు పాల్గొన్నారు.

19న భూతపురి 86వ జయంతి

కడప అర్బన్: 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 19న భూతపురి 86వ జయంతి, 21వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్రశర్మ తెలిపారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ బహుముఖ ప్రతిభాశాలి అని, కవిగా, అవధానిగా, జ్యోతిష్య వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకు న్నారన్నారు. దశాబ్దాలపాటు సాహితీసేవ చేశారన్నారు. ఆయన సాహితీసేవను గుర్తించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందన్నారు. 19న నిర్వహించే కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య వి సి ఆచార్య జి.రంగ జనార్ధన ముఖ్య అతిథిగా, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ (నెల్లూరు) సభాధ్యక్షులుగా, యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య విశిష్ట అతిథిగా విచ్చేస్తారని అన్నారు.

పాత సంగటిపల్లెలో నాకాబందీ

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

మండలంలోని పాత సంగటిపల్లిలో ఆదివారం ఉదయం నాకా బంది నిర్వహించారు. గ్రామంలోని ఫ్యాక్షన్ నాయకుల ఇళ్లను తనిఖీ చేశారు. ఏవైనా మారాణాయుధాలు ఉన్నాయనే అనుమానంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో భవిష్యత్‌లో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న తులసిరెడ్డి

ఇంటింటికీ స్టిక్కర్ అంటించడం హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్ ఇంటింటా అతికించాలని సిఎం జగన్ నిర్ణయించడం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన పఠాన్ మహమ్మద్ రఫీ, ఖాజాపీర్, ఎస్ఎండి సాహిల్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో స్టిక్కర్ పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. దేన్ని చూసి జగన్‌ను ప్రజలు నమ్మాలని తులసిరెడ్డి ప్రశ్నించారు. సొంత కుటుంబ సభ్యులైన డాక్టర్ సునీతారెడ్డి, షర్మిలాకే జగన్‌పై నమ్మకం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీని ప్రజలు తరిమి కొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి పూల నజీర్, ఉత్తన్న, శివ, బద్రీ, రామయ్య పాల్గొన్నారు.

ఖాజీపేటలో కొరవడిన రాత్రివేళ పోలీసుల గస్తీ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట పట్టణ పరిధిలో చోరీ ఘటనలు రోజురోజుకీ అధికమవుతున్నాయి. రాత్రిపూట పోలీసుల గస్తీని ముమ్మరం చేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతోనే దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్ల ముంగిట రాత్రిపూట వాహనాలను భద్రపరచుకోవాలంటే హడలిపోతున్నారు. తాళం వేసిన వాహనాలను సైతం దొంగలు ఎత్తుకెళుతున్నారని వాపోతున్నారు. వేసవి ప్రారంభం ముందే దొంగతనాలు ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకా ఇవి ఎక్కువ అవుతాయేమోనని స్థానికులు హడలిపోతున్నారు. గస్తీ తిరగాల్సిన బీట్ పోలీసులు స్టేషన్‌కే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. శుక్రవారం రాత్రి మైదుకూరు రోడ్డులో మెయిన్ రోడ్డుపై ఓ ఇంటి ముందు ఉంచిన స్కూటీని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ శాఖ అధికారులు స్పందించి రాత్రి గస్తీని ముమ్మరం చేసి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రయివేటు ఉపాధ్యాయుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రయివేటు ఉపాధ్యాయుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ స్వతంత్ర్య అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఆయన ప్రయివేటు ఉపాధ్యాయుల న్యాయమైన కోరికలను వివరించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవనాన్ని నెట్టుకొస్తున్న ప్రయివేటు ఉపాధ్యాయులకు గౌరవవేతనాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా డిఎస్సీ నిర్వహించాలన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు రమణ, శ్రీనివాసులరెడ్డి, ఆర్‌జెయుపి నాయకులు ముత్తోజ వీరబ్రహ్మం, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుదర్‌రెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ప్రయివేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్మన్ వరప్రసాద్

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాత రమణప్ప సత్రం పాఠశాల ఆవరణలో ఆదివారం సురక్ష ఐ కేర్ సెంటర్ వైద్యులు బాలాంజనేయులు ఆధ్వర్యంలో హైదరాబాద్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వైయస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో సుమారు 500 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో కిషోర్, ప్రకాష్, నారాయణ, మానవతా సభ్యులు కొండారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, హరిచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - వాల్మీకిపురం

విశ్రాంత ఉద్యోగులు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సమస్యలను పరిష్కరించడం కోసం భవనం అవసరమని, భవనానికి కావాల్సిన ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. స్థలం కేటాయిస్తే విరాళాల ద్వారా కార్యాల యాన్ని నిర్మించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శంకర, సభ్యులు మస్తాన్‌వలి, నారాయణ, సారధి, బివి రమణ, నాగరాజ, బషీర్, రామ్మూర్తి నాయుడు, క్రిష్ణమూర్తి, శంకర్ రెడ్డి, గోపాలక్రిష్ణమూర్తి, వెంకట్రమణ, నజీర్ సాహెబ్ పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - కురబలకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాద యాత్రను విజయవంతం చేద్దామని మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి శేఖర పిలుపునిచ్చారు. ఆదివారం తెట్టు గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నియంత పాలన సాగుతోందని అన్నారు. వైసిపికి ఓడిపోతామన్న భయం చుట్టుకున్నదని అన్నారు. తెట్టు పంచాయతీకి చెందిన టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయిందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జి.శంకరయాదవ్ ఆదేశాల మేరకు పాలేటిగంగమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో గ్రామకమిటీ అధ్యక్షునిగా ఎం.వాసుదేవనాయుడు, ఉపాధ్యక్షునిగా ఎం.నవీన్, ప్రధానకార్యదర్శిగా వై.ఆదెప్ప, కోశాధికారిగా ఎస్. సురేంద్ర, కార్యదర్శులుగా మల్లికార్జున, ఎం.చలపతినాయుడు, ఎం.భాస్కర్ రెడ్డి, డి. ఆదిరెడ్డెప్ప, బి.నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సురేంద్ర, క్లస్టర్ ఇన్చార్జి రమణ పాల్గొన్నారు.

ఒత్తిడితో జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- రూ.1.80 లక్షలు సరిపోవంటున్న లబ్ధిదారులు, జూన్ నాటికి లక్ష్యం నెరవేరేనా


వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జగనన్న ఇళ్ల నిర్మాణాలు అధికారుల ఒత్తిడితో పూర్తి పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సామూహిక జగనన్న గృహాలు జిల్లాలో 1,06,043 మంజూరు కాగా.. జనవరి 13 నాటికి కేవలం 13,780 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 92,263 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. ఉగాదికి కొన్ని ఇళ్లనైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో జనవరి చివరికి 5000 పూర్తి చేయాలని భావిస్తే అందులో కేవలం 1701 మాత్రమే చేయ గలిగారు. కేవలం 34 శాతం మంది మాత్రమే ఇల్లు కట్టుకున్నారు. ఇంకా ఫిబ్రవరి చివరికి 9247, మార్చికి 10000 వేల ఇళ్లను, ఈ మూడు నెలల్లో 24,247 పూర్తి చేయాలనే లక్ష్యాన్ని అధికారుల ముందు ప్రభుత్వం ఉంచింది. మొత్తంపై ఉగాది నాటికి ముఖ్యమంత్రిచే 33,025 ఇళ్ల సామూహిక ప్రవేశం చేసేలా కలెక్టర్ అధికారులను పరిగెత్తించేస్తున్నారు. ఆ మేరకు ప్రతి సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో, గురువారం ఆర్‌డిఓ సభా భవనంలో, మళ్లీ శుక్రవారం కడప పీడీ వద్ద జిల్లాలోని హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. హౌసింగ్ అధికారులతోపాటు విద్యుత్, నీటిపారుదల, ఇంజనీరింగ్, సచి వాలయ సిబ్బంది, వాలంటీర్లు ఆయా స్థాయి సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. పిఎంఎవైఎస్ కింద ఒక లబ్ధిదారునికి కేవలం రూ.1,80,000 మాత్రమే ఇస్తున్నారు. అది దేనికీ సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. పెరిగిన ధరలకు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ఉచితం అని చెప్పి, నేడు ప్రభుత్వం ఇచ్చే బిల్లులో ఇసుక కోసం టిప్పనుకు రూ.875 పట్టుకుంటున్నారని, దూరం బట్టి ట్రాక్టర్ బాడుగ రూ.1000 నుంచి ఆపైనే ఉంటుందన్నారు. ప్రభుత్వం మూడు అప్షన్స్ ఇచ్చి ఇప్పుడు పూర్తిగా లబ్ధిదారులే ఇల్లు నిర్మించుకోవాలని చెబుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి సామగ్రిలో అల్యూమినియం వాకిళ్లు, కిటికీలు కచ్చితంగా తీసుకోవాలని లేని పక్షంలో బిల్లులో మాత్రం తీసుకున్నట్లు వస్తుందని చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ మొత్తం సరిపోకపోతే స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీ లేకుండా రూ.35,000 ఇప్పించి, ఆ రుణాన్ని దశలవారీగా చెల్లించాలని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 సరిపోవకపోవడంతోనే ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదనేది స్పష్టమవుతోంది. ఆర్థికంగా ఉన్న వారు ఇప్పటికే కట్టుకున్నారు. లేనివారు ఇంకా పునాది గోడల వద్దనే ఉన్నారు. కొన్ని ఇళ్లు కప్పు లెవెల్‌కు, మరి కొన్ని గూళ్లస్థాయికి వచ్చి ఆగిపోయాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా లబ్ధిదారులకు కేంద్రం ఇచ్చే దానికి అదనంగా ఇలాంటి పరిస్థితుల్లో మరో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేస్తే ప్రభుత్వం అనుకున్నట్లు అన్ని ఇళ్లు పూర్తవుతాయని, అప్పుడు ఊళ్లనే జగనన్న నిర్మించారని చెప్పవచ్చని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారులకు ఆర్థిక వెసులుబాటు కల్పించకుండా అధికారులకు లక్ష్యాలు ఇచ్చినా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు.

మరో రూ.5 లక్షలు పెంచి ఇవ్వాలి



జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చే రూ.1,80,000కి అదనంగా మరో రూ.5 లక్షలు పెంచి ఇవ్వాలి. ధరలు పెరిగాయి. కూలి రేట్లు పెరిగాయి. సకాలంలో పూర్తి కావాలంటే మరో ఐదు లక్షలు పెంచి ఇవ్వాలి.

- వీరణాల శివ నారాయణ, సిపిఎం కార్యదర్శి

పచ్చదనంతో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు పచ్చదనానికి సోపానాలుగా నిలుస్తున్నాయి. తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఉపాధి పథక కార్యాలయం, వెలుగు కార్యాలయం, గ్రామ సచివాలయం-2 ఉన్నాయి. కార్యాలయ ఆవరణంలో అధికారులు వన మహోత్సవంలో భాగంగా వివిధ రకాల మొక్కలను నాటారు. నాడు నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. కార్యాలయ ఆవరణమంతా పచ్చదనంతో కళకళలాడుతుంది. ప్రజా అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మంచి ఆహ్లాదాన్నిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు కూడా మధ్యాహ్నం భోజన సమయంలో చెట్ల కిందే ఉంటూ కాసేపు విశ్రాంతి తీసుకుని తమ విధులను చురుగ్గా కొనసాగిస్తున్నారు. తహశీల్దార్ రమణారెడ్డి, ఉపాధి ఎపిఓ ప్రసాద్, ఎపిఎం శైలజ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు మొక్కలను సంరక్షించడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పచ్చని చెట్లతో కలకలాడుతూ ఆహ్లాదాన్ని ఇస్తుండడం పట్ల ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పచ్చని చెట్లతో దర్శనమిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం

విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే, నాయకులు


సన్మానం అందుకుంటున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నాగయ్యపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు ఎన్.వరదరాజులురెడ్డి, లింగారెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, చాపాడు ఎంపిపి టి.లక్షుమయ్య, శాంతరాజు, మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ వైస్ ఎంపిపి వైవి సుబ్బారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నాయకులను సన్మానించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. న్యూ కేటగిరి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన ఎడ్లకు బహుమతులు అందజేశారు.

దగా ప్రభుత్వాన్ని దించేద్దాం


మహిళలకు కరపత్రం అందజేస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజలను, నిరుద్యోగులను దగా చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా స్టీల్ ప్లాంట్ నిర్మించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, గోపాల్, బాలకృష్ణ, రాముడు, లక్ష్మయ్య, వెల్డింగ్ గైబు, రఫీ, సర్దార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ శివారులో ఉన్న శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఎస్‌పివిబి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ములకలచెరువు చిన్నారులచే శ్రీ సూర్య కుమార్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

అధ్వానం.. అనుసంధాన రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తెచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె, నెర్రవాడ రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మొక్కజొన్న, దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా పంట పొలాలకు వెళ్లే అడ్డ రోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకు పైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలున్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాల్లో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వానంగా మారింది. మిగిలిన ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే అటు రైతులకు, ఇటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.


అధ్వానంగా ఉన్న నెర్రవాడ-చియ్యపాడు రోడ్డు


వినోద్ తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అన్ని విధాలా ఆదుకుంటాం : ఎంపీ

ప్రజాశక్తి - చాపాడు

ఇటీవల మిద్దెపై నుంచి పడి వెన్నెముక విరిగి నడవలేని స్థితిలో ఉన్న చియ్యపాడు (త్రిపురవరం) గ్రామానికి చెందిన వైసిపి యూత్ వింగ్ నాయకులు ఎం.వినోద్‌కుమార్‌రెడ్డిని అన్ని విధాలా ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. వినోద్‌కుమార్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ఎంపీ ఆదివారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి నివాసంలో అతని తల్లిదండ్రులకు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వినోద్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకోసం ఎంత ఖర్చు అయినా భరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఫ్లయాష్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ఫ్లయాష్ టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపి నుండి పలు సిమెంట్ పరిశ్రమలకు, బ్రిక్స్ ఫ్యాక్టరీలకు తరలించే ఫ్లయాష్ టిప్పర్లను ఆదివారం స్థానిక వేంపల్లె రోడ్డులో ప్రజలు అడ్డుకున్నారు. టిప్పర్లను రోడ్డుపైనే ఆపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్న ఫ్లయాష్ రోడ్ల వెంబడి పడుతుండడంతో ఆ దుమ్ము కళ్లల్లో పడి మండుతున్నాయన్నారు. దాన్ని పీల్చుకోవడం ద్వారా శ్వాసకోశ సంబంధ వ్యాధులు వస్తున్నాయని ఆగ్రహించారు. రోడ్ల వెంబడి ఇళ్లలో ఉన్న తిను బండారాలపై ఫ్లయాష్ పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోగాల పాలై ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చెందారు. ఎర్రగుంట్ల, చిలమకూరు, పోట్లదుర్తి, మాలపాడు, కలమల్ల ప్రాంతాల ప్రజలు దీనిపై పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. రోడ్డుపైనే టిప్పర్లను ఆపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణయ్య ఘటనాస్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. ఏదైనా సమస్య ఉంటే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. అనంతరం స్థానికులు ఫ్లయాష్ తరలించే టిప్పర్ యజమానులపై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు టిప్పర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు పవర్ అల్తాఫ్

కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

- జిల్లా అధ్యక్షులు పవర్ అల్తాఫ్

ప్రజాశక్తి - వేంపల్లె

ఎలక్ట్రీషియన్స్ కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఎలక్ట్రీషియన్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఎలక్ట్రీషియన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్స్ కార్మికులకు బిల్డింగ్ అండ్ అథర్ కన్స్ట్రక్షన్ వెల్ఫేర్ బోర్డు (బిఒసి) కార్డుల ద్వారా ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు రావడం లేదన్నారు. చెప్పారు. ప్రభుత్వం నుండి అందాల్సిన పథకాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి కార్మికులందరికీ అవి మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరారు. అనంతరం కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మల్లికార్జున, దస్తగిరి, జిల్లా కార్యదర్శి సుభాన్, కోశాధికారి ప్రసాద్, వేంపల్లె అధ్యక్షుడు ముని కుమార్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న పోలీసులు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అర్బన్ సిఐ రాజు తెలిపారు. ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం పట్టణంలోని నగరిగుట్ట ప్రాంతంలో నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం సిఐ మాట్లాడుతూ నాటుసార అరికట్టుటలో భాగంగా ఇప్పటికే 80కేసులు నమోదు చేసి, వందమందికిపైగా అరెస్టు చేశామన్నారు. పలు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. చెడునడత, పాత కేసుల్లో నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు. నాటుసార, అక్రమ మద్యం, మట్కా, పేకాట వంటి వాటిపై సిఐ సెల్ నంబర్ 9121100544, ఎస్ఐ సెల్ 9705868553, 9121100546 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తగిన పారితోషికం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్, ఎక్సైజ్ ఎస్ఐ కల్యాణ్, ఎఎస్ఐ రామచంద్రయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మునెమ్మ(65) అనే ఉపాధి కూలీ మృతి చెందింది. ఆమె శనివారం ఉపాధి పని నిమిత్తం నరవతిప్పకు కందకాల పనికి తోటి కూలీలతో కలిసి వెళ్లింది. పని ప్రదేశంలో ప్రమావశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడింది. అక్కడే ఉన్న కూలీలు మునెమ్మను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సంఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపి, ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని ఇసి ఖాజా తెలిపారు.





కారు, లారీ ఢీ
ఇద్దరు మృతి
మరో ఐదుగురికి గాయాలు
తిరుమలకు వెళ్తుండగా ఘటన
బాధితులు తెలంగాణ వాసులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదు గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... తెలంగాణ ప్రాంతం మహబూబ్‌నగర్ జిల్లా గూత్‌పూర్ మండల అమీషార్ గ్రామానికి చెందిన ఏడుగురు తిరుమలకు పయనమయ్యారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. వేంక టేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు కారులో శనివారం బయలుదేరారు. ఆదివారం ఉదయం ఒంటిమిట్ట మండల పరిధిలోని మంగంపేట ఇరుకురాళ్ల బోట్టు మలుపు వద్ద చెన్నై నుంచి ఎదురుగా వస్తున్న లారీ వేగంగా కారును ఢీకొంది. దీంతో కారు రెండు ఫల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున వంశీకృష్ణ (24), సురేష్ (24) ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు హనుమంతు, కృష్ణవేణి, బిందేశ్వరి, రాము, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. జెసిబి సాయంతో కారులో ఇరుకున్న రెండు మృతదేహాలను వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన యువకులు

28 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి- రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో లయన్స్ కంటి ఆసుపత్రిలో 28 మందికి కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతోపాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, కలకడ, కలికిరి, యర్రావారిపాలెం, కెవిపాలెం, గుర్రం కొండ,పెద్దమండెం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 65 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 28 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప గుప్తా, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, లయన్స్ జిల్లా చైర్మన్ శివరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాలిక్ అసిస్టెంట్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

19న భూతపురి 86వ జయంతి

కడప అర్బన్: 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 19న భూతపురి 86వ జయంతి, 21వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్రశర్మ తెలిపారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ బహుముఖ ప్రతిభాశాలి అని, కవిగా, అవధా నిగా, జ్యోతిష్య వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపా దించుకు న్నారన్నారు. దశాబ్దాలపాటు సాహితీ సేవ చేశారన్నారు. ఆయన సాహితీసేవను గుర్తించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో
పాలకులు విఫలం
యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ విమర్శించారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ అధ్యక్షతన జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని బి.లక్ష్మీరాజా, యుటిఎఫ్ పతాకాన్ని మాదన విజయ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బి.లక్ష్మి రాజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని సేవా రంగంగా కాకుండా వ్యాపారీకరణ దృష్టితో చూస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తూ కార్పొరేటీకరిస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో పాలకులు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేద,బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను అందకుండా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఇపి అమలు చేసే సాకుతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మూసి వేస్తూ, ప్రభుత్వ విద్యకు పాడె కడుతున్నారని వాపోయారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటానని, అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు అమలు చేస్తామని, సకాలంలో డిఎలను చెల్లిస్తామని ఎన్నికల వాగ్దానంగా ప్రకటించారన్నారు. ఇప్పుడు ఉన్న వేతనాలలో కోత విధించి చరిత్రకెక్కాడని ఎద్దేవా



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజ

చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్ములను తమ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యా యులంటేనే భయపడుతోందని వాపోయారు. ఆ భయానికి కారణమేంటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను దూరం చేసేందుకే ఎన్నికల విధుల నుంచి తప్పించామని ప్రకటించుకుంటున్న ప్రభుత్వం నిత్యం పాఠశాలల్లో చేయిస్తున్న బోధనేతర కార్యక్రమాలపై ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుండి తప్పించగలరేమో కానీ ఉద్యోగ ,ఉపాధ్యాయులలో ఉన్న అసంతృప్తిని తొలగించలేరన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులను, ప్రభుత్వ తొత్తులను ఓడించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటూ ప్రజా, ఉద్యోగుల గొంతుకలను వినిపించే కత్తి నర్సింహారెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా, పోతుల నాగరాజును పట్టభద్రులు ఎమ్మెల్సీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పాలకుల తీరు మారకపోతే తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ ప్రసంగించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.రూతు ఆరోగ్య మేరీ, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.నాగార్జున రెడ్డి, వై.మస్తానయ్య, డి.వి.రవీంద్రుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సుజాత రాణి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా
-పెన్నానదిలో దిగి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇద్దరు యువకులు సరాదా కోసం పెన్నానదిలో ఈతకెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన సోములవారిపల్లె పంచాయతీ పధిలోని థర్మల్ రోడ్డు సమీపంలో ఉన్న పెన్నానదిలో చోటు చేసుకుంది. వివరాలు.. ప్రొద్దుటూరు పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన పోయిలమేన సురేంద్ర కుమారుడు పోయిలమేన సుధాకర్ (19), ఎద్దల నాగయ్య కుమారుడు విజయ్‌కుమార్ (18) ఆదివారం ఉదయం సెలవు రోజు కావడంతో ఈత కోసం సోములవారిపల్లె పంచాయతీలోని థర్మల్‌రోడ్డు సమీపంలో ఉన్న పెన్నానదిలో ఈతకెళ్లారు. అక్కడ ఇద్దరూ ఈత కొడుతుండగా ఒక్కసారిగా నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. రోడ్డుకు అటుగా వెళ్తున్న వారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు గజ ఈతగాళ్ల సాయంతో వారి జాడ కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. వారిలో విజయ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మరో యువకుడు సుధాకర్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు యువకుల మృతదేహాలను ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుల మృతితో హనుమాన్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటి ప్రవాహం తక్కువగా ఉన్నా..

నీటి ప్రవాహం తక్కువగా ఉన్నా ఇద్దరు యువకులు కేవలం ఇసుక ఊబిలో కూరుకుపోయి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా ఏర్పడిన గుంతల వల్లే ఇలా పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టే వస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

ఎన్‌జిఒల సమస్యల పరిష్కారానికి కృషి
- రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎన్‌జిఒల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి చేస్తామని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసులు, కే.వి. శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ముందుగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఇరిగేషన్ కాంపౌండ్ నుంచి ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్ మీదుగా జడ్‌పి కార్యాలయానికి చేరుకుంది. అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర నిధులు లేని కారణంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటవ తేదీ జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కరోనా తర్వాత రాష్ట్రం ఆర్థికంగా ఎంతో వెనుకబడిందని చెప్పారు. కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్, కోశాధికారి నిత్యపూజయ, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు,, తిమ్మారెడ్డి, బాల పుల్లయ్య, దస్తగిరి, జాయింట్ సెక్రెటరీ పోలిరెడ్డి, వెంగళరావు, నరసింహారెడ్డి, రాజశేఖర్, జయలక్ష్మి, నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్నయ్య, శైలేశ్వర్ రెడ్డి, వెంగళరావు, ప్రభుకర్, మున్వర్. ఉద్యోగ,కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉద్యోగులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎం.ఎస్ మొయిుద్దీన్

యువత నైతిక విలువలు పాటించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నేటి యువత విజ్ఞాన పరంగా ఎంత అభివృద్ధి చెందినా నైతిక పరంగా అట్టడుగు స్థాయిలో ఉన్నారని జమ అతె జిల్లా అధ్యక్షులు ఎంఎస్. మొయిద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని జమ అతె కార్యాలయంలో మానవత, నైతికత అనే అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతలో మార్పు తీసుకొచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11 నుంచి 20 తేదీ వరకు ఈ ఉద్యమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పెంపుడు జంతువులకు ఇస్తున్న విలువలు కూడా సాటి మనిషికి ఇవ్వడం లేదన్నారు. నైతికతతో కూడిన మానవత్వం అనేది ఒక మనిషిని సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దు తుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడటంవల్ల సమాజం పక్కదారి పడుతుందన్నారు. ప్రజల్లో మార్పు తెచ్చేందుకే ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల పట్ల, సమాజం పట్ల అవగాహన పెంచుకొని భావితరాలకు ఆదర్శంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖాజాపీర్, సయ్యద్ అస్లాం, కమిటీ సభ్యులు అలా ప్రకాష్, సిద్ధిక్ పాల్గొన్నారు.



ఆర్.సురేష్‌ను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్, అనంతన్

కరాటేలో సేవలకు అరుదైన గౌరవం
ప్రముఖులచే డాక్టర్ ఎఆర్.సురేష్‌కు ఘనసన్మానం


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కరాటేలో నిర్విరామ సేవలందించిన పట్టణానికి చెందిన డాక్టర్ ఏ.ఆర్.సురేష్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆదివారం విశాఖపట్టణంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు ఎస్‌పిఎండి.నాయుడు మాట్లాడుతూ సురేష్ కరాటేనే ఇంటిపేరుగా పెట్టుకుని షీటీమ్, సచివాలయ పోలీసులకు, ఉమెన్ పోలీసులకు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తన సంస్థ యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున ప్రముఖులచే ఆయనకు సన్మానం చేసినట్లు తెలిపారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ గతంలో ఎన్నో సన్మానాలు అందుకున్నానని, మహాగురు సోక్ సార్ కె.అనంతన్ మలేషియా, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం మరచిపోలేని మధురమైన అనుభూతిగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, నేపాల్, శ్రీలంక, స్విజర్ ల్యాండ్, మలేషియా, దుబాయ్ వంటి దేశాల నుండి కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేలందించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియోజకవర్గ కేంద్రంలో ఉన్నటువంటి నిరుపేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్యాన్ని అందించాలని వైసిపి నాయకులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు పిసి.యోగేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆధునాతన సాంకేతికతతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన అరవింద్ నేత్రాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవించడానికి కంటి చూపు చాలా అవసరం అన్నారు. గతంలో రాజంపేట ప్రజలు నాణ్యమైన కంటి వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేదన్నారు. నూతన టెక్నాలజీతో రాజంపేట ప్రజలకు అరవింద్ నేత్రాలయాన్ని అందుబాటులోకి తీసుకోవడం హర్షణీయమన్నారు. నియోజకవర్గ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాయకులు పిసి నాగేశ్వరెడ్డిని శాలవాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో



జ్ఞాపికను అందుకుంటున్న యోగేశ్వర్ రెడ్డి

కన్నుల పండువలా బసినికొండ గంధోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని బసినికొండ వద్ద గల బాబా అబ్దాల్ హుసేని సాహర్ వర్ధి ఫక్రి దర్గాహ్ 37వ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం గంధం మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మిగనూరు ఫక్రీ సదర్ చౌక్, బాబా ఫరీద్ దర్గాహ్ పీఠాధిపతి, బాబా అబ్దాల్ హుసేని దర్గాహ్, ఫక్రీ అలా చౌక్ మేనేజర్, ముతవల్లి కెఎస్ఎస్‌బి. నూర్ బాబా ఆధ్వర్యంలో జరిగాయి. ఉరుసు ముగింపు కార్యక్రమము బాబా అబ్దాల్ హౌసుని, బండారుఖాన పాతెహ నిర్వహించారు. తహళిల్ ఫాతెహాతో పాటు గొప్ప ఖవ్వాలి ఏర్పాటు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. కర్ణాటక దాదా పహాడ్ స్వాములు, కడప కవి కుట్లాగల్ , ముల్ భాగల్ స్వాములు, నూర్ బాబా స్వామి శిష్య బృందం ఎస్ఎ.రియాజ్, సర్దార్, షామీర్, జాకీర్, బాలు, ఎబి.మస్తాన్ పాల్గొన్నారు.



ఉరుసు ముగింపు ఉత్సవాల్లో పీఠాధిపతి

మాజీ సైనికుల పట్ల నిర్లక్ష్యం తగదు

కడప అర్బన్ : మాజీ సైనికుల పట్ల రక్షణ శాఖ నిర్లక్ష్యం వహించడం తగదని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సిఎస్ఐ హైస్కూల్‌లో జిల్లా మాజీ సైనికుల సమావేశం కెప్టెన్ ఎస్.ఎం. బాషా, అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ బి.వి. గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జానకిరామ్, సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సమస్యల పైన చర్చించారు. ముఖ్యంగా వారి సంక్షేమార్థం పనిచేస్తున్న కార్యాలయాలలో సైనికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న సబ్సిడీలు, సౌలభ్యాలు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని పారదర్శకంగా ఉంచటం కోసం సైనిక కార్యాలయంలో అడ్వైజరీ బోర్డు, ఇసిహెచ్ఎస్‌లో కన్సల్టెంట్ కమిటీ, మిల్ట్రీ క్యాంటీన్‌లో కన్జ్యూమర్ కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై పున ప్రారంభించాలని సంబంధిత అధికారులకు పలు విధాల వివరించినా వారు స్వార్థం కోసం నేటికీ స్పందించలేదని వాపోయారు. కేంద్రం ఇటీవల మాజీ సైనికుల కోసం నూతన పెన్షన్ విధానం ఏకపక్షంగా బలవంతంగా ఏర్పాటు చేయడంతో ఆన్‌లైన్ పరిజ్ఞానం లేని వృద్ధులు, వితంతువులు, మారుమూల ప్రాంతాలలో నివసించే వారు అవగాహన లేక సతమతమవుతున్నారని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

20 పరుగుల తేడాతో టీం-బి జట్టు విజయం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో శని ఆదివారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన మ్యాచ్‌లో అండర్ - 16, 19 టీం- బి జట్టు టీం- ఏ జట్టు పై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీం - ఏ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 165 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 1708 పరుగుల ఓవర్ నైట్‌తో రెండవ రోజు బ్యాటింగుకు దిగిన టీం -బి జట్టు 78 ఓవర్లలో 338 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 97, విజయ్ రామ్ రెడ్డి 86, సాయి రోహిత్ రెడ్డి 53 పరుగులు చేశారు. టీం- ఎ జట్టులోని శశాంక్ 3, వినయ్ రెండు, హరి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగుకు దిగిన టీం -ఏ జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసి చేసింది. ఆ చెట్టులోని సయ్యద్ మహమ్మద్ సైఫ్ 77 పరుగులు చేశాడు. టీం బి జట్టులోని ఆయుబ్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

నగరాభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రజాశక్తి - కడప

నగర్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఎక్కడైనా, ఎప్పుడైనా తాము సిద్ధమని వైసిపి నాయకులు సుబ్బారెడ్డి షఫీ బంగారు నాగయ్య యాదవ్ సవాల్ విసిరారు. ఆదివారం కడపలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్నమయ్య జిల్లాకు చెందిన శ్రీనివాసుల రెడ్డి కడప నగరం, అభివృద్ధి గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా కడప అభివృద్ధికి నాలుగు లక్షల రూపాయలు కూడా మంజూరు చేయించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క కడప నగరంలోనే రూ. 500 కోట్లకు పైగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎర్రముక్కపల్లి- రైల్వే స్టేషన్ రోడ్డు, మహావీర్ సర్కిల్- రిమ్స్ రోడ్లు విస్తరణ పూర్తయ్యాయి అన్నారు. మరో మూడు రోడ్ల విస్తరణ పనులు చేపట్టారని చెప్పారు. కడపలో ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణం అవుతున్నాయని, ఒక్కో హెల్త్ సెంటర్ 80 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయాంలో కడప నగరానికి ప్రభుత్వం నుండి ఎన్ని నిధులు వారు తెప్పించి అభివృద్ధి చేశారో చెప్పాలని ఈ సందర్భంగా వైసిపి నాయకులు ప్రశ్నించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

చేనేతలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

కడప అర్బన్: చేనేతలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని జాతీయ చేనేత ఐక్యవేదిక కన్వీనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున మాట్లాడుతూ చేనేతలకు అన్నీ పతాకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని పేర్కొన్నారు. ముద్రా రుణాలు, రాయితీలు పింఛన్లు, ఉప వృత్తులకు నేతన్న నేస్తం ఇవ్వాలని కోరారు. చేనేత లకు నిబంధనలు లేకుండా పతకాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో దక్షిణ భారత అధ్యక్షులు కొండప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఉపాధ్యక్షులు రామదాసు, రామచంద్ర, రాయలసీమ అధ్యక్షులు రామచంద్ర, ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు, ప్రచార కమిటీ కార్యదర్శి వెంకట రమణ, మహిళ అధ్యక్షురాలు సీతా దేవి, అన్ని జిల్లాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామస్వామి జీవితం అందరికీ ఆదర్శం

కడప అర్బన్ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామస్వామి జీవితం, ఆయన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చేసిన సేవలు అందరికీ ఆదర్శం అని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రామస్వామి 82 వ జయంతిని పురస్కరించుకుని ఆర్‌జెయుపి భుజంగరావు స్మారక టీచర్స్ భవన్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాధారణ సెకండరీ గ్రేడు స్థాయి నుంచి ప్రధానోపాధ్యాయుని స్థాయి వరకు చేరుకున్నారని చెప్పారు. రాష్ట్ర, జాతీయ ఉపాధ్యాయ పరిషత్ సంఘంలో వివిధ స్థాయిలలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల కోసం నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులరెడ్డి ఆయన ఉత్తమ విలువలను అందించారని కార్యక్రమంలో టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షులు ప్రసాదరావు, సీనియర్ నాయకులు వేంకటేశ్వర రెడ్డి, ఆపస్ రామమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఒత్తిడితో జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- రూ.1.80 లక్షలు సరిపోవంటున్న లబ్ధిదారులు, జూన్ నాటికి లక్ష్యం నెరవేరేనా



వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జగనన్న ఇళ్ల నిర్మాణాలు అధికారుల ఒత్తిడితో పూర్తి పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సామూహిక జగనన్న గృహాలు జిల్లాలో 1,06,043 మంజూరు కాగా.. జనవరి 13 నాటికి కేవలం 13,780 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 92,263 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. ఉగాదికి కొన్ని ఇళ్లనైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో జనవరి చివరికి 5000 పూర్తి చేయాలని భావిస్తే అందులో కేవలం 1701 మాత్రమే చేయగలిగారు. కేవలం 34 శాతం మంది మాత్రమే ఇల్లు కట్టుకున్నారు. ఇంకా ఫిబ్రవరి చివరికి 9247, మార్చికి 10000 వేల ఇళ్లను, ఈ మూడు నెలల్లో 24,247 పూర్తి చేయాలనే లక్ష్యాన్ని అధికారుల ముందు ప్రభుత్వం ఉంచింది. మొత్తంపై ఉగాది నాటికి ముఖ్యమంత్రిచే 33,025 ఇళ్ల సామూహిక ప్రవేశం చేసేలా కలెక్టర్ అధికారులను పరిగెత్తించేస్తున్నారు. ఆ మేరకు ప్రతి సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో, గురువారం ఆర్‌డిఒ సభా భవనంలో, మళ్లీ శుక్రవారం కడప పీడీ వద్ద జిల్లాలోని హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. హౌసింగ్ అధికారులతోపాటు విద్యుత్, నీటిపారుదల, ఇంజనీరింగ్, సచి వాలయ సిబ్బంది, వాలంటీర్లు ఆయా స్థాయి సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. పిఎంఎవైఎస్ కింద ఒక లబ్ధిదారునికి కేవలం రూ.1,80,000 మాత్రమే ఇస్తున్నారు. అది దేనికీ సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. పెరిగిన ధరలకు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ఉచితం అని చెప్పి, నేడు ప్రభుత్వం ఇచ్చే బిల్లులో ఇసుక కోసం టిప్పునకు రూ.875 పట్టుకుంటున్నారని, దూరం బట్టి ట్రాక్టర్ బాడుగ రూ.1000 నుంచి ఆపైనే ఉంటుందన్నారు. ప్రభుత్వం మూడు అప్షన్స్ ఇచ్చి ఇప్పుడు పూర్తిగా లబ్ధిదారులే ఇల్లు నిర్మించుకోవాలని చెబుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి సామగ్రిలో అల్యూమినియం వాకిళ్లు, కిటికీలు కచ్చితంగా తీసుకోవాలని లేని పక్షంలో బిల్లులో మాత్రం తీసుకున్నట్లు వస్తుందని చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ మొత్తం సరిపోకపోతే స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీ లేకుండా రూ.35,000 ఇప్పించి, ఆ రుణాన్ని దశలవారీగా చెల్లించాలని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 సరిపోవకపోవడంతోనే ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదనేది స్పష్టమవుతోంది. ఆర్థికంగా ఉన్న వారు ఇప్పటికే కట్టుకున్నారు. లేనివారు ఇంకా పునాది గోడల వద్దనే ఉన్నారు. కొన్ని ఇళ్లు కప్పు లెవెల్‌కు, మరి కొన్ని గూళ్లస్థాయికి వచ్చి ఆగిపోయాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా లబ్ధిదారులకు కేంద్రం ఇచ్చే దానికి అదనంగా ఇలాంటి పరిస్థితుల్లో మరో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేస్తే ప్రభుత్వం అనుకున్నట్లు అన్ని ఇళ్లు పూర్తవుతాయని, అప్పుడు ఊళ్లనే జగనన్న నిర్మించారని చెప్పవచ్చని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారులకు ఆర్థిక వెసులుబాటు కల్పించకుండా అధికారులకు లక్ష్యాలు ఇచ్చినా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు.

మరో రూ.5 లక్షలు పెంచి ఇవ్వాలి



జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చే రూ.1,80,000కి అదనంగా మరో రూ.5 లక్షలు పెంచి ఇవ్వాలి. ధరలు పెరిగాయి. కూలి రేట్లు పెరిగాయి. సకాలంలో పూర్తి కావాలంటే మరో ఐదు లక్షలు పెంచి ఇవ్వాలి.

- వీరణాల శివ నారాయణ, సిపిఎం కార్యదర్శి

పచ్చదనంతో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు పచ్చదనానికి సోపానాలుగా నిలుస్తున్నాయి. తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఉపాధి పథక కార్యాలయం, వెలుగు కార్యాలయం, గ్రామ సచివాలయం-2 ఉన్నాయి. కార్యాలయ ఆవరణంలో అధికారులు వన మహోత్సవంలో భాగంగా వివిధ రకాల మొక్కలను నాటారు. నాడు నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. కార్యాలయ ఆవరణమంతా పచ్చదనంతో కళకళలాడుతుంది. ప్రజా అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మంచి ఆహ్లాదాన్నిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు కూడా మధ్యాహ్నం భోజన సమయంలో చెట్ల కిందే ఉంటూ కాసేపు విశ్రాంతి తీసుకుని తమ విధులను చురుగ్గా కొనసాగిస్తున్నారు. తహశీల్దార్ రమణారెడ్డి, ఉపాధి ఎపిఒ ప్రసాద్, ఎపిఎం శైలజ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు మొక్కలను సంరక్షించడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పచ్చని చెట్లతో కలకలాడుతూ ఆహ్లాదాన్ని ఇస్తుండడం పట్ల ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చని చెట్లతో దర్శనమిస్తునన ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం

విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే, నాయకులు



సన్మానం అందుకుంటున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నాగయ్యపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు ఎన్.వరదరాజులురెడ్డి, లింగారెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, చాపాడు ఎంపిపి టి.లక్ష్మయ్య, శాంతరాజు, మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ వైస్ ఎంపిపి వైవి సుబ్బారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నాయకులను సన్మానించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. న్యూ కేటగిరి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన ఎడ్లకు బహుమతులు అందజేశారు.

దగా ప్రభుత్వాన్ని దించేద్దాం



మహిళలకు కరపత్రం అందజేస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజలను, నిరుద్యోగులను దగా చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా స్టీల్ ప్లాంట్ నిర్మించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జంభాపురం రమణారెడ్డి, గోపాల్, బాలకృష్ణ, రాముడు, లక్ష్మయ్య, వెల్డింగ్ గైబు, రఫీ, సర్దార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ శివారులో ఉన్న శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఎస్‌పివిబి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ములకలచెరువు చిన్నారులచే శ్రీ సూర్య కుమార్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.




నృత్యం చేస్తున్న చిన్నారులు

అధ్వానం.. అనుసంధాన రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తెచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె, నెర్రవాడ రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మెక్కజొన్న, దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా పంట పొలాలకు వెళ్లే అడ్డ రోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకు పైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలున్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాల్లో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వానంగా మారింది. మిగిలిన ప్రాంతంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే అటు రైతులకు, ఇటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.



అధ్వానంగా ఉన్న నెర్రవాడ-చియ్యపాడు రోడ్డు



అబ్రహం లింకన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి అధ్యక్షులు, విద్యార్థులు

అమెరికా ధ్రువతార అబ్రహం లింకన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహం లింకన్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బిసి బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింకన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ అమెరికా చరిత్రలో అత్యంత సంక్షోభ సమయంలో అబ్రహం లింకన్ అధ్యక్షుడిగా కొనసాగి చాలా సమస్యలు పరిష్కరించారని అన్నారు. రక్తపాతం, అంతర్యుద్ధం, నైతిక, రాజ్యాంగ పరమైన సంక్షోభ దశలో ఆయన ప్రదర్శించిన రాజనీతి, నాయకత్వం అమెరికాను నాగరిక దేశంగా ఆవిర్భవించడానికి కారణమైందన్నారు. అమెరికా ఫెడరల్ వ్యవస్థ ప్రత్యేకించి మన దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుందంటే దానికి కారణం లింకన్ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు బానిసత్వాన్ని నిర్మూలించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో వార్డెన్ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి-కలికిరి

మండలం మహల్ గ్రామంలో వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆగాముద్దీన్ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగాముద్దీన్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరుగుతున్న ఈ ఉరుసుకు హిందూ, ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. గంధం, .జెండా ప్రారంభించి సతీష్ రెడ్డి ఇంటి దగ్గర నుంచి పెద్ద ఎత్తున ఊరేగింపుతో నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమంలో పీఠాధిపతి పగడాల లక్షీపతి

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని బీరంగి పంచాయతీ శంకరాపురంలోని గూగుటికోనలో ఉన్న బండెన్న స్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబవుతోంది. ప్రతి ఏడాది శివరాత్రికి ఈ ఆలయానికి జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన కర్ణాటక నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. విద్యుత్ కాంతులతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 131 దేవతా మూర్తుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టు కుంటున్నాయి. ఆ విగ్రహాల ఎదుట చిన్న పిల్లలు సందడి చేస్తారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది మహా శివరాత్రి వేడుకలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ ఏడాది మరింత వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 17న శుక్రవారం శివకోటి అర్చన, 18న సాసవల చిన్నమ్మ కథ, చెక్కభజన ప్రదర్శనలు ఉంటాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు యథాతథంగా స్పందన

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని స్థానిక తహశీల్దార్ సభా భవనంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తాహశీల్దార్ నరసింహ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని రైతులు మరే ఇతర సమస్యలున్న స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పిస్తే తక్షణ సాయం అందజేస్తామని తెలిపారు. ప్రతి అర్జీను సంబంధిత అధికారులకు సమర్పించి తరువాతి స్పందన కార్యక్రమంలోపల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవళంపేటలోని కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేకంగా అలంకరించి ద్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, నాయన వారి శ్రీనివాసులు నాయుడు, కుమార్ నాయుడు, మాధవయ్య నాయుడు, నరసింహులు, శంకరయ్య, రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.



ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

అన్నదానం గొప్పది

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో మేడాలమ్మ విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల విగ్రహ ప్రతిష్ట అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దాత గుడ్లసుబ్బారెడ్డి తెలిపారు. అన్నదానం పుణ్య కార్యమన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాత రమణప్ప సత్రం పాఠశాల ఆవరణలో ఆదివారం సురక్ష ఐ కేర్ సెంటర్ వైద్యులు బాలాంజనేయులు ఆధ్వర్యంలో హైదరాబాద్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వైయస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో సుమారు 500 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో కిషోర్, ప్రకాష్, నారాయణ, మానవతా సభ్యులు కొండారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, హరిచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మునెమ్మ(65) అనే ఉపాధి కూలీ మృతి చెందింది. ఆమె శనివారం ఉపాధి పని నిమిత్తం నరవతిప్పకు కందకాల పనికి తోటి కూలీలతో కలిసి వెళ్లింది. పని ప్రదేశంలో ప్రమావశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడింది. అక్కడే ఉన్న కూలీలు మునెమ్మను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు రిమ్స్‌కు తరలించారు.



ఎమ్మెల్యే చింతలకు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విశ్రాంత ఉద్యోగులు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సమస్యలను పరిష్కరించడం కోసం భవనం అవసరమని, భవనానికి కావాల్సిన ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. స్థలం కేటాయిస్తే విరాళాల ద్వారా కార్యాల యాన్ని నిర్మించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శంకర, సభ్యులు మస్తాన్‌వలి, నారాయణ, సారథి, బివి రమణ, నాగరాజ, బషీర్, రామ్మూర్తి నాయుడు, క్రిష్ణమూర్తి, శంకర్ రెడ్డి, గోపాలక్రిష్ణమూర్తి, వెంకట్రమణ, నజీర్ సాహెబ్ పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-కురబలకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దామని మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి శేఖర పిలుపునిచ్చారు. ఆదివారం తెట్టు గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నియంత పాలన సాగుతోందని అన్నారు. వైసిపికి ఒడిపోతామన్న భయం చుట్టుకున్నదని అన్నారు. తెట్టు పంచాయతీకి చెందిన టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయిందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జి.శంకరయాదవ్ ఆదేశాల మేరకు పాలేటిగంగమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో గ్రామకమిటీ అధ్యక్షునిగా ఎం.వాసుదేవనాయుడు, ఉపాధ్యక్షునిగా ఎం.నవీన్, ప్రధానకార్యదర్శిగా వై.ఆదెప్ప, కోశాధికారిగా ఎస్.సురేంద్ర, కార్యదర్శులుగా మల్లికార్జున, ఎం.చలపతినాయుడు, ఎం.భాస్కర్ రెడ్డి, డి.ఆదిరెడ్డెప్ప, బి.నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సురేంద్ర, క్లస్టర్ ఇన్చార్జి రమణ, శ్రీరాములు, తిమ్మరాయుడు, వెంకటరమణ, సుధాకర్, చంద్ర, నర్సింహులు, రమేష్, రవి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

రూ.2.5 లక్షల విలువైన సిసి కెమెరాలు వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తంబళ్లపల్లి మల్లయ్యకొండలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.2.5 లక్షల వ్యయంతో సిసి కెమెరాలను రామిగానిపల్లి గ్రామానికి చెందిన దాతల సాయంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీరు మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామంలో నివాసమున్నారు. తూగు సుకుమార్ రెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డిలు తల్లిదండ్రులు కీ.శే. శివరామిరెడ్డి చంద్ర కాంతమ్మల జ్ఞాపకార్థం ఈ సాయం అందించారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



సోషల్ మీడియా కన్వీనర్ పవన్‌కుమార్

మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనరుగా పవన్ కుమార్ నియ మితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినాయకత్వం నుండి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సోషల్ మీడియా మండల కన్వీనరుగా నియమించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి సోషల్ మీడియా జిల్లా నాయకులకు, స్థానిక వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, వారికి మరింత చేరువ చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మండలం అన్నివిధాలా అభివృద్ధి సాధించడం జరిగిందని కితాబునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అఖండ విజయానికి శాయశక్తుల కృషి చేస్తానని స్పష్టం చేశారు. **కలికిరి :** వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన భాను ప్రకాష్ నియామితులయ్యారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామ చంద్రా రెడ్డి, ఎపిఎండిఎస్‌సి డైరెక్టర్ హరీష్ రెడ్డి సూచన మేరకు, మండల వైసిపి నాయకుల సహకారంతో అందించారని భానుప్రకాష్ తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని పెద్దినేనికాల్వ గ్రామపంచాయతీలోని ఈడిగపల్లిలో నివాసముండే వత్తలూరి నాగరాజ, అతని కుటుంబం సభ్యులకు ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించినట్లు జనసేన నాయకులు రామ శ్రీనివాసులు, మచ్చ లక్ష్మీనారాయణ తెలిపారు. వీరికి టిడిపి ప్రభుత్వ హయాంలో సొంత ఇల్లు మంజూరు చేసినప్పటికీ ప్రభుత్వం మారడంతో వైసిపి ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం బిల్లులని జారీ చేయలేదని తెలిపారు. ఎన్నిసార్లూ బిల్లుల కోసం యత్నించినప్పటికీ ఫలితం దక్కలేదనాని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల జనసేన నాయకులు వారిని పరామర్శించి ఆర్థికసాయం చేసినట్లు వారు తెలిపారు. జనసేన పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

వేర్వేరు ప్రాంతాలలో 11 మంది అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ తోటిపల్లె వద్ద పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.8,310 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది తాతయ్య, రాజేంద్ర నాయక్, శ్రీనివాసులు, కాంతారావు నాయక్, మునిరాజా, డ్రైవర్ రమేష్, సంజీవ పాల్గొన్నారు. **కలికిరి :** మండల పరిధిలోని కె.భరినేపల్లి గ్రామ సమీపాన లోపల-బయట, మంగతాయి జూదం ఆడుతున్న వారిపై శనివారం రాత్రి వాయల్పాడు సిఐ బిఎన్.సురేష్, కలికిరి ఎస్ఐ లోకేష్ రెడ్డి, సిబ్బందితో దాడిచేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు తెలిపారు వారివద్ద నుంచి రూ.16,320 నగదును, 52 పేక ముక్కలు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా పేకాట, మంగతాయి వంటి కార్యక్రమాలు చేపడితే ప్రజలు సహకరించి సంబంధిత పోలీస్‌శాఖకు తెలపాలన్నారు.

మహిళను గాయపరిచిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మహిళను గాయపరిచిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కదిరాయ చెరువుకు చెందిన గంటా శ్రీనివాసులు భార్య ప్రమీల తనకు సంబంధించిన కోళ్లను నెలరోజుల క్రితం ఎవరో దొంగలించారని తెలిపారు. కోళ్లను తీసుకెళ్లిన వారిని ఆమె దూషిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీరాములు, అతని భార్య, బంధువులు కలసి ప్రమీలను నిలదీశారని అన్నారు. ఇదే క్రమంలో ఆదివారం ఉదయం తమ పెంపుడు కుక్కను ఎవరో కొట్టడంతో ప్రమీల మరల దూషిస్తున్న క్రమంలో శ్రీరాములు, అతని భార్య వారి బంధువులు ఆ మహిళపై ఘర్షణకు దిగి గాయపరిచినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని అన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.